సాక్షి
పార్వతీపురం మన్యం

గురువారం । 29 । జూన్ । 2023



ఎత్తుకు పై ఎత్తు

విజయనగరం వేదికగా రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి.

- 8లో



జలకళ

చీపురుపల్లి: తోటపల్లి ప్రాజెక్టు నీరు చీపురుపల్లికి చేరింది. కుడిప్రధాన కాలువలో నీరు ప్రవహిస్తుండడంతో రైతులు సంతోషపడుతున్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

విజయనగరం: త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండగ నిలుస్తుందని జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మనిషి సేవా నిరతి, క్షమా గుణం అలవర్చుకోవాలన్నది పండగ ప్రధాన ఉద్దేశమన్నారు. బక్రీద్ పండగ సందర్భంగా ముస్లిం సోదరులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఆ అల్లా దయతో, ప్రతీ ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

అవీ ఇవీ..

ముఖ్యమంత్రికి సత్కారం

వీరఘట్టం/పాలకొండ: కురుపాం నియోజకవర్గం అభివృద్ధికి వరాలజల్లు కురిపించిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు దంపతులు ఘనంగా సన్మానించారు. వీరితో పాటు డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర బొబ్బిలివీణతో సత్కరించారు. టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, డీసీఎంఎస్ ఛైర్‌పర్సన్ అవనాపు భావన, విక్రమ్ దంపతులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని దుశ్శాలువతో సన్మానించారు.

అలరించిన ఆదివాసీ నృత్యప్రదర్శనలు



కురుపాం సభావేదిక వద్ద ఆదివాసీల సంప్రదాయ నృత్య ప్రదర్శన

కురుపాం/గుమ్మలక్ష్మీపురం: కురుపాంలోని సీఎం సభావేదిక ఆవరణతో పాటు హెలిప్యాడ్ నుంచి సభావేదికకు వచ్చే మార్గంలో ఆదివాసీలు సంప్రదాయ నృత్యప్రదర్శనలతో అలరించారు. డప్పువాయిద్యాలతో సీఎంకు స్వాగతం పలికారు. సీఎం సభలో ఆదివాసీ నృత్యప్రదర్శనకు అవకాశం ఇవ్వడం ఆనందంగా ఉందని ఆ సంఘం అధ్యక్షుడు బిడ్డిక సాంబర తెలిపారు.

స్మైల్ ప్లీజ్



వీరఘట్టం: కురుపాం వచ్చిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో సెల్ఫీ తీసుకునేందుకు జనం, నాయకులు పోటీపడ్డారు. సీఎం సెల్ఫీలకు అంగీకరించడంతో సంతోషం వ్యక్తంచేశారు.

అభినందనల జల్లు



జియ్యమ్మవలస: అమ్మఒడి నాలుగో విడత నిధులు విడుదల కార్యక్రమంలో కురుపాం ఆదర్శ పాఠశాల చిన్నారి సుచరిత చౌదరి ఇంగ్లిష్‌లో అనర్గళంగా ప్రసంగించడంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మురిసిపోయారు. సీఎంతో పాటు విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ సుచరితను అభినందించారు.

అస్వస్థతకు గురైన దిశ ఎస్‌ఐ



అస్వస్థతకు గురైన ఎస్‌ఐను బైక్‌పై హాస్పిటల్‌కు తీసుకెళ్తున్న సీఐ ప్రసాదరావు

జియ్యమ్మవలస: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సభకు బందోబస్తుకు హాజరైన శ్రీకాకుళం దిశ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ రేవతి అస్వస్థతకు గురయ్యారు. వెంటనే సీఐ ప్రసాదరావు చినమేరంగి సీహెచ్‌సీకి తరలించి వైద్యపరీక్షలు చేయించారు. ఎటువంటి ప్రమాదం లేదని వైద్యులు తెలపడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఆహ్వానం



పార్వతీపురం మన్యం జిల్లాకు వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కలెక్టర్, ఎస్పీ, జేసీ, ఐటీడీఏ పీఓలు స్వాగతం పలికారు.



కురుపాం వేదికగా నిర్వహించిన అమ్మఒడి నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రులు అమర్నాథ్, బొత్స సత్యనారాయణ, పీడిక రాజన్నదొర, జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు పుష్పశ్రీవాణి, జోగారావు, శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, కలెక్టర్ నిషాంత్‌కుమార్, శత్రుచర్ల పరీక్షిత్‌రాజు



మన్యం ఒడిలో... అమ్మఒడి సంబరం

పార్వతీపురం మన్యం జిల్లాలోని దారులన్నీ కురుపాం వైపే సాగాయి. అమ్మఒడి నాలుగో ఏడాది నిధుల విడుదల చేసేందుకు కొండకోనల్లోకి బుధవారం వచ్చిన జననేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి మన్యంవాసులు ఘనంగా స్వాగతం పలికారు. అభిమాన నేతను చూసి పులకించిపోయారు. నాలుగేళ్లుగా చేసిన అభివృద్ధిని సీఎం వివరిస్తుంటే గర్వపడ్డారు. పిల్లల భవిష్యత్తుకు భరోసా ఇస్తుంటే మురిసిపోయారు. ప్రభుత్వంపై దుష్టచతుష్టయం చేస్తున్న తప్పుడు ప్రచారాలను వివరిస్తుంటే నిజమేనంటూ వంతపాడారు. మేమంతా జగనన్న వెంటే ఉంటామంటూ జేజేలు పలికారు. మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగనన్న అంటూ ప్లకార్డులు ప్రదర్శించి మద్దతు తెలిపారు.



కురుపాంలో సీఎం సమావేశానికి హాజరైన అశేష జనం

- కురుపాం వేదికగా అమ్మఒడి నాలుగో ఏడాది నిధుల విడుదల
- సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సభకు పోటెత్తిన జనం
- దారులన్నీ కురుపాం వైపే..
- ఉదయం నుంచీ మన్యంలో పండగ సందడి
- సాంస్కృతిక ప్రదర్శనలతో జననేతకు ఘన స్వాగతం
- వరాల జల్లు కురిపిస్తుంటే పులకించిన కురుపాం వాసులు

కురుపాం/పార్వతీపురం:

పార్వతీపురం మన్యం జిల్లాలో బుధవారం పండగ సందడి కనిపించింది. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల చదువులకు ఆర్థిక భరోసా కల్పించే బృహత్తర కార్యక్రమాన్ని కురుపాం వేదికగా నిర్వహించినందుకు మన్యం వాసులు సంతోషపడ్డారు. విద్యార్థుల తల్లుల ఖాతాలకు బటన్ నొక్కి అమ్మ ఒడి నిధులు విడుదల చేసేవేళ విద్యార్థులు కేరింతలు కొట్టారు. థాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులు పట్టుకుని నినదించారు. ఖాతాల్లో డబ్బులు జమయ్యేవేళ తల్లిదండ్రులు మురిసిపోయారు. పేదకుటుంబాల పిల్లల చదువుకు, పేదల ఆర్థిక ఉన్నతికి కృషిచేస్తున్న మా మంచి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అంటూ కితాబిచ్చారు.

జగనన్నరాకకోసం...


జగనన్న రాకకోసం ఉదయం నుంచి వేచి చూశారు. చినమేరంగిలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ నుంచి కురుపాంలోని సభాస్థలికి చేరుకునేవరకు సాంస్కృతిక ప్రదర్శనలతో స్వాగతం పలికారు. పూల వాన కురిపించారు. నాలుగేళ్లుగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో చేస్తున్న, చేసిన అభివృద్ధిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వివరించడంపై హర్షం వ్యక్తంచేశారు. గిరిజన వర్సిటీ, కళాశాల, వైద్యకళాశాలల మంజూరును స్వాగతించారు. ప్రభుత్వ సేవలన్నీ పల్లెల్లో అందజేసేందుకు వీలుగా సిగ్నల్ సమస్యలు రాకుండా సెల్‌టవర్లు నిర్మిస్తున్నట్టు సీఎం చెప్పడంతో ఆయన దూరదృష్టిని అభినందించారు. గిరిజన ప్రాంత అభివృద్ధికి, గిరిజనుల సంక్షేమానికి సీఎం చూపుతున్న ప్రేమకు ఫిదా అయ్యారు. సభలో సీఎం చేస్తున్న మేలును తలుచుకుని చర్చించుకున్నారు.



ముఖ్యమంత్రికి జ్ఞాపికను అందజేస్తున్న అధికారులు



థాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బాలికలు



లబ్ధిదారులకు అమ్మఒడి నమూనా చెక్కును అందజేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

జగనన్నతోనే చదువుల విప్లవం

- ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి



పార్వతీపురం/కురుపాం:

కురుపాం నియోజకవర్గంపై ముఖ్య మంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వరాల జల్లు కురుపించారు. ఉత్తరాంధ్రలో నాలుగు మెడికల్ కళాశాలలు మంజూరు చేయగా అందులో కురుపాంనకు ఒక మెడికల్ కళాశాలను సీఎం మంజూరు చేసినట్టు ప్రకటించారు. కురుపాం వేదికగా సాగిన అమ్మఒడి నిధుల విడుదల కార్యక్రమంలో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి మాట్లాడుతూ కనీవిని ఎరుగని ఆలోచన అమ్మఒడి పథకమన్నారు. పేదరికం నుంచి బయట పడాలంటే విద్య ఒక్కటే మార్గమని నమ్మిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందుకు అనుగుణంగా అడుగులు వేస్తున్నారన్నారు. అమ్మని మించిన దైవం లేదు.. అన్నను మించిన ధైర్యం లేదు.. అమ్మఒడికి మించిన పథకం లేదని కీర్తించారు. చదువుల విప్లవం ఎలా ఉంటుందో మన జగనన్న చేసి నిరూపించారన్నారు. గతంలో ప్రైవేటు పాఠశాలల్లో చదివే వారికి స్టేట్ ర్యాంకులు వచ్చేవని.. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారికి కూడా స్టేట్ ర్యాంకులు వస్తున్నాయన్నారు. గడిచిన నాలుగేళ్లలో విద్య కోసం రూ.66,722.36 కోట్లు కేటాయించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గతంలో దివంగత నేత వై.ఎస్.రాజశేఖర రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేసి ఎంతో మంది జీవితాలను మార్చారన్నారు. ప్రస్తుతం జగన్‌మోహన్‌రెడ్డి విద్యలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతో ఎంతో మంది పేదల తలరాతలు మారుస్తున్నారన్నారు. 40 ఏళ్ల రాజకీయ చరిత్ర అంటూ చెబుతున్న చంద్రబాబునాయుడుకు... పేదప్రజల పిల్లల కోసం ఏదైనా చేయాలని ఆలోచన వచ్చిందా అని సభాముఖంగా ప్రశ్నించారు. అమ్మఒడి అబద్ధం కాదు అక్షయ పాత్ర అని కొనియాడారు. అమ్మఒడి పథకాన్ని కాపీ కొట్టి పేరు మార్చి తన మేనిఫెస్టోలో చేర్చి ప్రజలకు పక్కదారి పట్టించే పులిహోర హామీలు.. దద్దోజనం మాటలను ప్రజలు విశ్వసించరన్నారు. ఎన్ని పథకాలనైనా కాపీ కొట్టగలరు కానీ జగనన్న మంచి మనస్సును, నిబద్ధతను, అంకితభావాన్ని కాపీ కొట్టలేరన్నారు. ఇది 2014 ఎన్నికల సమయం కాదని, 2024 ఎన్నికల సమయం కనుక జగనన్నను ఇంచికూడా కదపలేరన్నారు. జగనన్నను ఓడించలేరు కదా.. కనీసం నీడను కూడా తాకలేరన్నారు. ఈ సందర్భంగా కురుపాం నియోజకవర్గానికి గడిచిన నాలుగేళ్లలో ఇంజినీరింగ్ కళాశాల మంజూరు, రూ.1200 కోట్లతో అభివృద్ధి పనులు, రూ.వెయ్యి కోట్లతో సంక్షేమ పథకాలను సీఎం జగన్‌మోహన్ రెడ్డి అందించారన్నారు. న్న మేలును తలుచుకుని చర్చించుకున్నారు.



కురుపాంపై వరాల జల్లు

సమావేశంలో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి నియోజకవర్గంలోని గుమ్మిడిగెడ్డ పై మినీ రిజర్వాయర్(సింగుపురం)వద్ద నిర్మాణానికి రూ.38 కోట్లు మంజూరు చేయాలని, తోటపల్లి-గుణుపూరు రహదారి పరిధిలో బ్రిటిష్‌కాలం నిర్మించిన ఎడమకాలువపై ఉన్న శిథిల వంతెన స్థానంలో ప్రత్యామ్నాయ వంతెన నిర్మాణానికి రూ.12కోట్లు మంజూరు చేయాలని, గరుగుబిల్లి మండలంలోని జంఝావతి కాలువ 21ఎల్ డిస్ట్రిబ్యూటరీ కాలువలో ఉల్లిభద్ర సమీపంలో లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణానికి రూ.5కోట్లు మంజూరు చేయాలని, ఐటీడీఏ పరిధిలో 66వేల ఎకరాల్లో జీడితోటసాగు అవుతుందని దీనికి గుమ్మలక్ష్మీపురంలో మహిళా సంఘాల సభ్యులతో జీడి పరిశ్రమ ఏర్పాటు చేయాలని రాష్ట్రముఖ్య మంత్రి దృష్టికి కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి తీసుకొని వెళ్లగా పై సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి నిధులు మంజూరుకు సభా ముఖంగా హామీ ఇచ్చారు.

పేద కుటుంబాలకు వరం

పేద కుటుంబాలకు జగనన్న అమ్మ ఒడి పథకం ఒక వరంలాంటిదని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అన్నారు. గత ఏడాది 85వేల మంది తల్లుల ఖాతాలో రూ.129 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. ఈ ఏడాది కూడా అంతే మందికి నగదును జమ చేయడం జరుగుతుందన్నారు. నాడు-నేడు మొదటి విడతలో రూ.129 కోట్లతో జిల్లాలోని 486 పాఠశాలల రూపురేఖలు మార్చారన్నారు. అలాగే, రెండో విడత నాడు-నేడు కార్యక్రమంలో రూ.145 కోట్లతో 545 పాఠశాలలను ఆధునీకరించినట్టు వెల్లడించారు. ఎనిమిదో తరగతి చదువుతున్న పదివేల మంది విద్యార్థులకు సాంకేతిక విద్యలో భాగంగా ట్యాబ్‌లను అందించామన్నారు.

ఘనంగా స్వాగతం



కురుపాం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికి చినమేరంగిలోని పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర ఉపముఖ్య మంత్రి పీడిక రాజన్నదొర, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, విజయనగరం జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు పాలవలస విక్రాంత్, ఇందుకూరు రఘురాజు, ఎమ్మెల్యేలు పాముల పుష్పశ్రీవాణి, బడుకొండ అప్పల నాయుడు, అలజంగి జోగారావు, విశ్వాసరాయి కళావతి, కంబాల జోగులు, శంబంగి చినఅప్పలనాయుడు, రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, కలెక్టర్ నిషాంత్‌కుమార్, వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, జీసీసీ ఛైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి, విజయనగరం డిప్యూటీ మేయర్ కె.శ్రావణి, టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, మాజీ ఎంపీ డీవీజీ శంకరరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పాలవలస రాజశేఖర్, శోభా హైమావతి, మాజీ ఎమ్మెల్యే జయమణి, డీసీసీబీ ఛైర్మన్ చినరామినాయుడు, డీసీఎంఎస్ ఛైర్‌పర్సన్ అవనాపు భావన, కొప్పల వెలమ రాష్ట్ర కార్పొరేషన్ అధ్యక్షుడు నెక్కలనాయుడుబాబు, తూర్పుకాపు కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ మామిడి శ్రీకాంత్, జెడ్పీ వైస్ ఛైర్మన్ మరిశర్ల బాపూజీ, జేసీ ఆర్.గోవిందరావు, డీఆర్వో జె.వెంకటరావు, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పీఓ లు సి.విష్ణుచరణ్, కల్పనాకుమారి తదితరులు సీఎంకు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.



జీసీసీ వ్యాపార లక్ష్యం రూ.64 కోట్లు

- చిన్నతరహా అటవీ ఉత్పత్తుల కొనుగోలుకు పెద్దపీట
- గతేడాది లక్ష్యాలకు మించి వ్యాపారం
- గిరిజన సహకార సంస్థ డీఎం సంధ్యారాణి



మాట్లాడుతున్న జీసీసీ డీఎం సంధ్యారాణి

సీతంపేట: గిరిజన సహకార సంస్థ 2023-24 ఆర్థిక సంవత్సరంలో వ్యాపార లక్ష్యం రూ.64 కోట్లుగా నిర్ణయించినట్టు సంస్థ డివిజనల్ మేనేజర్ జి.సంధ్యారాణి తెలిపారు. సీతంపేట జీసీసీ కార్యాలయంలో విలేకరులతో ఆమె బుధవారం మాట్లాడారు. ఇప్పటివరకు రూ.కోటి17 లక్షల వ్యాపారం చేశామన్నారు. గత సంవత్సరం రూ.49 కోట్ల వ్యాపార లక్ష్యంగా నిర్ణయించగా, రూ.63 కోట్ల వ్యాపారం చేసినట్టు వెల్లడించారు. చింతపండు 35 టన్నులు, కుంకుడికాయలు 500ల క్వింటాళ్లు కొనుగోలు చేశామన్నారు. కుంకుడు కాయల ధర కిలోకు 15 పెంచామన్నారు. గతంలో గిరిజనుల నుంచి కిలో రూ.45కు కొనుగోలుచేస్తే ఇప్పుడు రూ.60 చెల్లిస్తున్నట్టు వెల్లడించారు. చిన్నతరహా అటవీఉత్పత్తులను కొనుగోలుకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. మెటల్ స్టేట్ ట్రేడ్ కార్పొరేషన్ ద్వారా టెండర్లు పిలిచి జీసీసీ ఉత్పత్తులను విక్రయిస్తున్నట్టు వెల్లడించారు. గిరిజనులకు కావాల్సిన నిత్యావసర సరుకులన్నీ డీఆర్‌డీపోల్లో విక్రయిస్తున్నామన్నారు. రుణాల రికవరీలో పాతపట్నం డివిజన్ ముందంజలో ఉందని తెలిపారు. గతేడాది మంజూరు చేసిన రూ.10 లక్షల రుణాలు రికవరీ కాగా, సీతంపేట బ్రాంచ్ పరిధిలో రూ.4 లక్షలకు రూ.2లక్షల 20 వేలు మాత్రమే రికవరీ అయినట్టు తెలిపారు. 57 రేషన్ డిపోలకు మరమ్మతులు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదించామన్నారు. ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు అన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాలలు, గురుకులాలకు సన్‌ఫ్లవర్ నూనె, నాణ్యమైన కందిపప్పు, మినప పప్పు సరఫరా చేస్తున్నామన్నారు. అరకు కాఫీ దుకాణం సీతంపేటలో పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో జీసీసీ సీతంపేట, పాతపట్నం బీఎంలు కృష్ణ, నరసింహులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

క్లుప్తంగా

రథయాత్ర సందర్భంగా పాదయాత్ర



మంగళపాలెం నుంచి సింహాచలం పాదయాత్రగా సాగుతున్న భక్తులు

కొత్తవలస: జగన్నాథస్వామి మారు రథయాత్ర సందర్భంగా మండలంలోని మంగళపాలెం గ్రామానికి చెందిన గురుదేవ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు ఆధ్వర్యంలో సింహాచలం వరకు బుధవారం పాదయాత్ర చేశారు. అరకు,పాడేరు ప్రాంతాలకు చెందిన సుమారు రెండువేల మందితో గిరిజనులతో ఈ యాత్ర నిర్వహించారు.సర్వే జనా సుఖినోభవంతు అంటూ యాత్ర సాగింది. పాదయాత్రలో కోలాటాలు, ప్రత్యేక భజనలు ఆకర్షణగా నిలిచాయి. ఈ తరహా యాత్రను ప్రతి ఏడాదీ జగన్నాథ స్వామి మారు రథ యాత్ర రోజున నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నట్లు జగదీష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

మైనారిటీ కార్పొరేషన్ ఈడీగా లావణ్య

విజయనగరం ఫూల్‌బాగ్: మైనారిటీ కార్పొరేషన్ ఈడీగా ఎం లావణ్య (ఎఫ్ఏసీ) బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈడీగా ఇప్పటి వరకూ పనిచేసిన ఎం.లక్ష్మి తన మాతృసంస్థకు బదిలీపై వెళ్లడంతో తాను ఈ బాధ్యతలు చేపట్టినట్లు లావణ్య ఈ సందర్భంగా తెలిపారు.


ఎన్‌సీసీ ఆఫీసర్‌కు రెడ్‌క్రాస్ పురస్కారం



అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ ఎం.వరలక్ష్మికి రెడ్ క్రాస్ సొసైటీ విజయనగరం సంస్థ నుంచి పురస్కారం లభించింది. ఈ మేరకు ఇటీవల పురస్కారం అందుకున్నట్లు కళాశాల యాజమాన్యం బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ సీహెచ్‌వెంకటలక్ష్మి, డాక్టర్ దామోదరనాయుడు, గ్రంథాలయ అధికారి డాక్టర్ లెంక సత్యవతి తదితరులు ఆమెను అభినందించారు.

సంగీత కళాశాలలో సర్టిఫికెట్, డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలు



మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల, విజయనగరం

విజయనగరం టౌన్: స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో సర్టిఫికెట్, డిప్లమో కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కేఏవీఎల్ఎన్.శాస్త్రి బుధవారం తెలిపారు. భారతీయ సంస్కృతి, కళల పట్ల అవగాహన కలిగించి ఆకర్షితులను చేసే ఉద్దేశంతో సంగీత కళాశాలలో నాలుగేళ్ల సర్టిఫికెట్ కోర్సు, రెండేళ్ల డిప్లమో కోర్సులను నిర్వహిస్తున్నామన్నారు. సర్టిఫికెట్ కోర్సులో ఉత్తీర్ణులైన వారు మాత్రమే డిప్లమో కోర్సుకు అర్హులని వెల్లడించారు. గాత్రం, వీణ, వయోలిన్, నాదస్వరం, మృదంగం, డోలు, భరతనాట్యం అంశాల్లో కోర్సులు ఉన్నాయన్నారు. ప్రవేశానికి దరఖాస్తులు చేయాలనుకునే అభ్యర్థులు 2023 జూలై ఒకటో తేదీనాటికి పదేళ్ల నిండి 60 ఏళ్ల లోపు వయసు కలిగి ఉండాలన్నారు. ఆసక్తి కల అభ్యర్థులు కళాశాల సమయవేళల్లో సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 08922-223751 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 550.00
విజయనగరం	రూ. 554.00
శ్రీకాకుళం	రూ. 554.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	58,960-00
బంగారం(22సి. 10గ్రా.)	54,050-00
వెండి (కిలో)	75,700-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹135	₹240	₹ 250

అక్టోబర్ 17 నుంచి ఓటర్ల జాబితా సవరణ

- తప్పుల్లేని జాబితా తయారు చేయాలి
- నిబంధనల మేరకు ఓట్ల నమోదు, తొలగింపు
- కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మండల స్థాయి అధికారులు

విజయనగరం అర్బన్: జిల్లాలో ఓటర్ల నమోదు ప్రక్రియలో తప్పులు లేని జాబితా తయారు చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి స్పష్టం చేశారు. అక్టోబర్ 17 నుంచి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని అందుకోసం ముందస్తుగా ఐఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, బీఎల్‌ఓలకు శిక్షణ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో బుధవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఓటర్ల జాబిత సవరణ ప్రక్రియపై పలు సూచనలు జారీ చేశారు. జూలై 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే నిర్వహించి ఓటర్ల చిరునామా, పేర్లు, ఫొటోలు సరి చూడాలని శతశాతం కచ్చితమైన నమోదు జరగాలని సూచించారు. ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగించడం, చేర్చడం మొత్తం ప్రక్రియ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకే జరగాలని చెప్పారు. ఓటర్లు, జనాభా నిష్పత్తి, జెండర్ రేషియో కచ్చితంగా ఉండేలా చూడాలని ఎక్కడైనా ఎక్కువ లేదా తక్కువ ఉంటే అందుకు గల కారణాలను సహేతుకంగా వివరించేలా సిద్ధంగా ఉండాలని చెప్పారు. షిఫ్టింగ్, ఓటర్లకు నోటీసులు జారీ చేసి తొలగించాలన్నారు. అలాగే డెత్ ఓటర్లను తొలగించాలని స్పష్టం చేశారు. బీఎల్‌ఓల ఖాళీలను అన్ని నియోజక వర్గాల్లో వెంటనే పూరించాలని అదే విధంగా వారికీ శిక్షణ కార్యక్రమాలను పూర్తి చేయాలని చెప్పారు. తహసీల్దార్లు ప్రతి పోలింగ్ స్టేషన్‌ను సందర్శించి పోలింగ్ రోజున ఓటర్లకు సౌకర్యంగా ఉండేలా మార్పులు చేయాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులను 24 గంటల్లో పరిష్కరించాలని అన్నారు. ఎన్నికల నిబంధనలను పాటిస్తూ షెడ్యూల్ ప్రకారంగా కచ్చితంగా పనులు జరిగేలా చూడాలని లేని యెడల ఎన్నికల కమిషన్ చర్యలకు వారే బాధ్యులవుతారని హెచ్చరించారు.

ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్ ఇలా..

వచ్చే నెల 20 తేదీ వరకు ఐఆర్‌ఓలు, ఏఐఆర్‌ఓలు, బీఎల్‌ఓలకు శిక్షణ. జూలై 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు బీఎల్‌ఓల ఇంటింటి సర్వే. ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 29వ తేదీ వరకు పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, రీ అరేంజ్‌మెంట్, రీకాస్టింగ్, ఫొటోల క్వాలిటీ పెంపు తదితర కార్యాలయ అంతర్గత పనులు. సెప్టెంబర్ 30 నుంచి 2024 జనవరి 1వ తేదీ వరకు 18 ఏళ్ల నిండే ఓటర్లతో ముసాయిదా జాబితా తయారీ, వివిధ ఫార్మాట్ నమూనాలను రూపొందించడం, ప్రింటింగ్ తదితర కార్యాలయ అంతర్గత పనులు. అక్టోబర్ 17న ముసాయిదా జాబితా ప్రకటన. నవంబర్ 30 లోపు ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, విజ్ఞప్తుల స్వీకరణ. ఈ మధ్య కాలంలో రెండు ఆదివారాలు, రెండు శనివారాలు ప్రత్యేక ప్రచార కార్యక్రమం. డిసెంబర్ 26న అభ్యంతరాలు, విజ్ఞప్తుల పరిశీలన, 2024 జనవరి ఒకటవ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితా సవరణ, తనిఖీ ప్రక్రియ. జనవరి 5న తుది ఓటర్ల జాబితా ప్రకటన ఉంటుంది.

రీ సర్వే వేగంగా జరగాలి

అన్ని గ్రామాల్లో జూలై నెలాఖరు నాటికి రీ సర్వే ప్రక్రియ పూర్తి కావాలని కలెక్టర్ తెలిపారు. ఈ లక్ష్యాలను సీసీఎల్ఏ నిర్ణయించిందని ఇందులో ఎలాంటి మార్పులు ఉండబోవని స్పష్టం చేశారు. అవసరమైన చోట్ల రోవర్స్‌ను అధనంగా కేటాయిస్తామని సిబ్బందిని కూడా పక్క మండలాల నుంచి డిప్యూటేషన్‌పై ఇచ్చినట్లు చెప్పారు. మండలాల వారీగా సమీక్షిస్తూ తహసీల్దార్ లాగిన్‌లో ఉన్న వివరాలను వెంటనే ఆర్‌డీఓ లాగిన్‌లోకి పంపాలని సూచించారు. రోజుకు కనీసం 100 ఎకరాలలో సర్వే పూర్తి కావాలన్నారు. సమావేశంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, డిప్యూటీ కలెక్టర్‌లు సూర్యనారాయణ, పద్మలత, సర్వే శాఖ ఎ.డి త్రివిక్రమరావు తదితరులు పాల్గొన్నారు.

ఎత్తుకు పై ఎత్తు

- ప్రారంభమైన రాష్ట్రస్థాయి చెస్ పోటీలు
- అండర్-7 కేటగిరీలో 85మంది క్రీడాకారుల హాజరు



కార్యక్రమంలో మాట్లాడుతున్న పీటీసీ ప్రిన్సిపాల్ ఆనంద్‌బాబు



వివిధ జిల్లాల నుంచి పోటీలకు హాజరైన చిన్నారులు, తల్లిదండ్రులు

విజయనగరం: విజయనగరం వేదికగా రాష్ట్ర స్థాయి చెస్‌పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో అండర్-7 కేటగిరీలో నిర్వహించిన పోటీలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 85 మంది బాల,బాలికలు పాల్గొన్నారు. వీరికి జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించగా.. ముఖ్యఅతిథులుగా పోలీస్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆనంద్ బాబు, సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్‌లు హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పీటీసీ ప్రిన్సిపాల్ ఆనంద్‌బాబు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమన్నారు. మెదుడుకు పదును పెట్టే చెస్ వంటి క్రీడాంశంలో చిన్నతనం నుంచి ప్రోత్సహించడం ద్వారా భవిష్యత్‌లో మంచి క్రీడాకారులుగా ఎదుగుతారని ఆశాభావం వెలిబుచ్చారు. సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్ మాట్లాడుతూ క్రీడా రంగంలో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, విద్యార్థుల తల్లిదండ్రులు ఆ దిశగా ప్రోత్సహించాలని కోరారు.

జాతీయ స్థాయికి ప్రతిభావంతులు

జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి కేవీ జ్వాలాముఖి మాట్లాడుతూ విజయనగరం వేదికగా మూడు రోజుల పాటు రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నాయని తెలిపారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇద్దరు బాలికలు, ఇద్దరు బాలురను త్వరలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు పంపించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బీఏ.రావు, చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.భీమారావు తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువులు కల్తీ చేస్తే కఠిన చర్యలు

- జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు



సమావేశంలోమాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు

విజయనగరం ఫోర్ట్: విత్తనాలు, ఎరువులు కల్తీ చేస్తే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి వి. తారాకరామారావు హెచ్చరించారు. ఈ మేరకు స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎరువులు, పురుగు మందుల ప్రైవేట్ డీలర్స్‌తో బుధవారం సమావేశం నిర్వహించారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు రైతులకు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని డీలర్స్‌కు స్పష్టం చేశారు. వ్యవసాయ, విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ అధికారులు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను పరిశీలించాలని సూచించారు. తనిఖీల్లో స్టాక్ రిజిస్టర్, గిడ్డంగిలో నిల్వ పరిశీలించాలని చెప్పారు. నకిలీ, విత్తనాలు, పురుగు మందులు విక్రయించినట్టు సమాచారం వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, రికార్డులు నిర్వహణ కచ్చితంగా ఉండాలని స్పష్టం చేశారు. సమావేశంలో విజిలెన్స్ డీఎస్పీ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు సాగు హక్కు పత్రాలు

- జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: అసలైన సాగుదారులను గుర్తించి వారికి వివిధ ప్రభుత్వ పథకాలను అందించాలన్నది ప్రభుత్వం ఉద్దేశం. దీనికిగాను కౌలు రైతులను గుర్తించి వారికి సాగు హక్కు ధ్రువీకరణ పత్రాలను అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం ఈ సంవత్సరం 10,176 మందికి సాగు హక్కు ధ్రువీకరణ పత్రాలను ఇవ్వాలని నిర్ణయించగా ఇప్పటి వరకు 4,602 సాగు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. రైతులు సాగు చేస్తున్న గ్రామంలో ఈ కార్డును పొందడానికి అర్హులు. అయితే కొంత సొంత భూమి కలిగి ఉండి, కొంత కౌలు చేస్తున్న రైతులు కూడా ఈ కార్డును పొందడానికి అర్హులు. కౌలు కార్డులను గ్రామ రెవెన్యూ అధికారి జారీ చేస్తారు. సాగు హక్కు ధ్రువీకరణ పత్రం గల భూమిలేని సాగుదారులకు కూడా వైఎస్సార్ రైతు భరోసా-పీఎంకిసాన్ పథకంలో లబ్ధి చేకూరుతుంది. ఈ కార్డులు పొందిన రైతులకు వ్యవసాయ రుణాలు, వీరిని గ్రూపులుగా చేసి జేఎల్‌జీ (జాయింట్ లయబిలిటీ గ్రూపు) రుణాలను కూడా మంజూరు చేయాలని ఇటీవల నిర్వహించిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో బ్యాంకర్లను కలెక్టర్ ఆదేశించారు. అందువల్ల జిల్లాలోని కౌలు రైతులు (సాగుదారులు) తప్పకుండా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జేసీ మయూర్ అశోక్ ఒక ప్రకటన ద్వారా బుధవారం తెలియజేశారు. భూయజమాని నుంచి అంగీకార పత్రం, ఆధార్ కార్డు, రైతు ఆధార్ కార్డు తీసుకుని గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించాలని సూచించారు.

కేజీబీవీల్లో టీచింగ్ పోస్టుల భర్తీకి స్కిల్‌టెస్ట్



కుమరాం కేజీబీవీలో స్కిల్ టెస్ట్ నిర్వహిస్తున్న డీఈఓ,డిప్యూటీ కలెక్టర్, డైట్ ప్రిన్సిపాల్

జామి: జిల్లాలో ఖాళీగా ఉన్న కేజీబీవీ టీచర్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేసేందుకు బుధవారం స్కిల్ టెస్ట్ నిర్వహించారు. ఈ మేరకు జామి మండలంలోని కుమరాం కేజీబీవీలో డీఈఓ లింగేశ్వరరెడ్డి, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వరరావు,డైట్ ప్రిన్సిపాల్ తిరుపతినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన స్కిల్ టెస్ట్‌కు మొత్తం 70 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ప్రిన్సిపాల్, సీఆర్టీ మ్యాథ్స్, సీఆర్టీ ఫిజిక్స్, సీఆర్టీ బయాలజీ, సీఆర్టీ ఇంగ్లీష్ పోస్ట్‌లకు స్కిల్‌టెస్ట్‌ను బుధవారం నిర్వహించారు. గురువారం ఇదే పాఠశాలలో ఉదయం 10 గంటలకు పీజీటీ జువాలజీ, పీజీటీ ఫిజిక్స్, పీజీటీ ఇంగ్లీష్, పీజీటీ కెమిస్ట్రీ, పీజీటీ బోటనీ, మధ్యాహ్నం ఒంటిగంటకు పీజీటీ హిస్టరీ, పీజీటీ ఎకనామిక్స్, పీజీటీ కెమిస్ట్రీ, పీజీటీ సివిక్స్ పోస్టులకు స్కిల్ టెస్ట్ నిర్వహించనున్నట్లు డీఈఓ లింగేశ్వరరెడ్డి తెలిపారు.

పశుగణాభివృద్ధి సంస్థ కార్యవర్గానికి అభినందనలు



జెడ్పీ చైర్మన్ తో కార్యవర్గ సభ్యులు

విజయనగరం గంటస్తంభం: జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు నూతన కార్యవర్గం బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ బెల్లాన బంగారు నాయుడు, కార్యవర్గ సభ్యులు కేత వీరన్న, జి.లక్ష్మణ్,వెంకటలక్ష్మి, పైడితల్లి , గోపాలం, బుగత రమణ తదితరులను జెడ్పీ చైర్మన్ అభినందించి పాడి ఉత్పత్తి అభివృద్ధిలో మెరుగైన సేవలందించాలని సూచించారు.

అత్యున్నత స్థాయికి విద్యా ప్రమాణాలు

- నాలుగో ఏడాది జగనన్న అమ్మఒడి నిధులు విడుదల
- కృతజ్ఞతలు తెలిపిన జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం గంటస్తంభం: ఇచ్చిన మాటకు కట్టుబడి పథకాలను ప్రారంభించడమే కాకుండా వాటిని క్రమం తప్పకుండా అమలు చేస్తూ వరుసగా నాలుగో ఏడాది కూడా అమ్మఒడి పథకం కింద తల్లుల ఖాతాల్లో నగదు విడుదల చేసిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన బుధవారం మాట్లాడారు. అమ్మఒడి నాలుగో విడతలో రాష్ట్రంలోని సుమారు 83,15,341 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.6,392.94 కోట్లు జమచేసే కార్యక్రమానికి కురుపాం వేదికగా శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్రంలో ఈ నాలుగేళ్లల్లో కేవలం ఒక్క అమ్మఒడి పథకం కోసమే రూ.26,067 కోట్లు ఖర్చు చేశారంటే విద్యాభివృద్ధిపై ముఖ్యమంత్రికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. పేదరికం కారణంగా ఏ ఒక్కవిద్యార్థి చదువుకు దూరంకాకుడదన్న ఆశయంతో జగనన్న అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, జగనన్న గోరుముద్ద, జేవీకే కిట్ల పంపిణీ వంటివి అమలుచేస్తున్నారన్నారు. ఆంగ్ల మాధ్యమం, సీబీఎస్ఈ సిలబస్, ట్యాబ్‌ల పంపిణీ, స్మార్ట్ టీవీల ఏర్పాటు, బైజూస్ కంటెంట్, కేజీబీవీలను ఇంటర్ వరకు స్థాయి పెంపు, కొత్త కళాశాలల ఏర్పాటు వంటివి చేపడుతున్నారని తెలిపారు. రాష్ట్ర విద్యార్థులు వివిధ పోటీ పరీక్షల్లో ఘన విజయాలను సాధించడమే కాకుండా, ప్రపంచ స్థాయిలో పోటీ పడేలా మన విద్యా ప్రమాణాలను ముఖ్యమంత్రి ఉన్నత శిఖరాలకు చేర్చారని కొనియాడారు. కురుపాంలో ముఖ్యమంత్రి సభ విజయవంతమయ్యిందని, ఇందుకు కృషి చేసిన అధికార యంత్రాంగానికి, తరలివచ్చిన ప్రజాప్రతినిధులకు, నాయకులకు, కార్యకర్తలకు, అశేష జనవాహినికి ఆయన కతజ్ఞతలు తెలిపారు.

దశల వారీగా సచివాలయాల పూర్తి

- పంచాయతీ రాజ్ ఎస్ఈ జీఎస్ఆర్ గుప్త



కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఈ గుప్త

బొబ్బిలి: జిల్లాలోని 530 సచివాలయాలకు గాను 505 సచివాలయ భవనాల నిర్మాణం వివిధ దశల్లో ఉనని, వాటన్నింటినీ దశల వారీగా సెప్టెంబర్ 15 నాటికి పూర్తి చేయడమే లక్ష్యంగా పనులు చేపడుతున్నామని పంచాయతీ రాజ్ పర్యవేక్షక ఇంజినీరు జీఎస్ఆర్ గుప్త అన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక పీఆర్ సబ్ డివిజన్ ఆధునికీకరించిన కార్యాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సచివాలయాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.194 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. ఇప్పటికే ఈ భవనాల్లో 379 పూర్తయ్యాయని తెలిపారు. అలాగే 496 ఆర్‌బీకే భవనాలకు గాను 275 పూర్తయ్యాయన్నారు. మరో పక్క 435 వెల్‌నెస్ సెంటర్ల భవనాలకు రూ.76 కోట్లు మంజూరు కాగా వాటిలో 173 పూర్తయ్యాయన్నారు. ప్రస్తుతం నిర్మాణాలకు సంబంధించిన బిల్లుల చెల్లింపు త్వరగానే జరుగుతోందని చెప్పారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్లు బాధ్యతగా పనిచేయాలి

రాష్ట్రప్రభుత్వం చేపట్టిన సచివాలయ భవనాలను త్వరగా నిర్మించేందుకు ఇంజినీరింట్ అసిస్టెంట్లు నిత్యం పర్యవేక్షించాలని పీఆర్ ఎస్ఈ గుప్త కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నాలుగు మండలాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఈలు, డీఈఈలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం విధించిన లక్ష్యాలను సెప్టెంబరు నాటికి పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేశారు. సమావేశంలో ఈఈ జి శ్రీనివాసులు, డీఈఈ సీహెచ్‌వీ అప్పారావు, ఏఈలు రాజశేఖర్, రమేష్, ఎంపీడీఓ పోతుల రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బుబిళ్లపై మక్కా మసీదు



సబ్బుబిళ్లపై చెక్కిన మక్కా మసీదు

కొత్తవలస: బక్రీద్ పండగ సందర్భంగా మండలంలోని దెందేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన డ్రాయింగ్ ఉపాధ్యాయుడు జి.పరమేశ్వరరావు సబ్బుబిళ్లపై మక్కా మసీదును చిత్రించి అబ్బురపరిచారు. ఆయన రూపొందించిన ఈ చిత్రం పలువురిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆ ఉపాధ్యాయుడిని పాఠశాల సిబ్బంది అభినందించారు.



డ్రాయింగ్ టీచర్ జి.పరమేశ్వరరావు

ఆర్థిక అక్షరాస్యతపై ముగిసిన క్విజ్ పోటీ

- 14న విశాఖలో రాష్ట్రస్థాయి పోటీలు



రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే విజేతలతో లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ ఎ.శ్రీనివాసరావు

విజయనగరం అర్బన్: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జాతీయస్థాయిలో పాఠశాల విద్యార్థులకు 'ఆర్థిక అక్షరాస్యత' అంశంపై నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీలు బుధవారం స్థానిక పువ్వాడ స్కూల్‌లో ముగిశాయి. జిల్లావ్యాప్తంగా తొలుత పాఠశాల, మండల స్థాయిలో నిర్వహించిన పోటీల్లోని విజతలు జిల్లా స్థాయి పోటీలలో పాల్గొన్నారు. విద్యాశాఖ నిర్దేశించిన మండల స్థాయి అధికారుల బృందం ఆధ్వర్యంలో జిల్లాలోని 27 మండల కేంద్రాల్లో ఈ పోటీలు నిర్వహించింది. జిల్లా స్థాయిలో జరిగిన పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వరుసగా భోగాపురం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థుల బృందం (జి.తరుణ్, కె.తరుణ్), వంగర మండలం మరువాడ జిల్లాపరిషత్ విద్యార్థుల బృందం (బి.మీనాకుమారి, జి.రమ్య), గర్భాం ఏపీమోడల్ స్కూల్ విద్యార్థుల బృందం (జి.సర్వతి, ఎం.వందన) నిలిచారు. జిల్లా స్థాయిలో ప్రకటించిన మొదటి, ద్వితీయ, తృతీయ విజేతలకు వరుసగా రూ.10 వేలు, రూ.7,500, రూ.5 వేలు నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాలను లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ ఎ.శ్రీనివాసరావు విజేతలకు అందజేశారు. వచ్చే నెల 14న విశాఖలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా తరపున వీరంతా హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ కార్యాలయ సిబ్బంది శేఖర్, లీడ్ బ్యాంక్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్తబగ్గాంలో కలెక్టర్ పర్యటన



సురక్ష సర్వేతీరును పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

గజపతినగరం రూరల్: మండలంలోని కొత్తబగ్గాం గ్రామంలో కలెక్టర్ నాగలక్ష్మి బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా గ్రామంలో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక లబ్ధిదారులతో మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చేయడమే ఈసర్వే ప్రధాన ఉద్దేశమని అవగాహన కలిగించారు. అనంతరం గ్రామంలో ఉన్న సచివాలయానికి వెళ్లి రికార్డులను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని, పథకాల అమలులో బాధ్యతగా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. ఈ పర్యటనలో ఆమెతో పాటు ఎంపీడీఓ కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ట్యాంకర్ కింద పడి డ్రైవర్ మృతి



దినేష్ మృతదేహం

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట సమీపంలో డాబా వద్ద గ్యాస్ ట్యాంకర్ బ్యాక్ చేస్తుండగా ప్రమాదవశాత్తు ట్యాంకర్ కింద పడి డ్రైవర్ మృతి చెందాడు. బుధవారం జరిగిన ఈ ప్రమాదంపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దినేష్ యాదవ్ రాయపూర్ నుంచి విశాఖపట్నం గ్యాస్ ట్యాంకర్ తీసుకుని వెళ్తున్నాడు. ఆరికతోట సమీపంలోని డాబా వద్ద కొద్దిసేపు ఉపశమనం పొందుదామన్న ఉద్దేశంతో ఆపి వేరే లారీ డ్రైవర్‌ను పిలిచి పార్కింగ్ కోసం ట్యాంకర్‌ను బ్యాక్ చేయాలని తాను వెనుక ఉండి సిగ్నల్ ఇస్తానని కోరాడు. వెంటనే వేరే లారీ డ్రైవర్ ట్యాంకర్‌ను బ్యాక్ చేస్తుండగా వెనుక ఉండి సిగ్నల్ చూపుతున్న దినేష్‌పైకి ప్రమాదవశాత్తు ట్యాంకర్ వచ్చేసింది. దీంతో దాని చక్రాల కింద పడి దినేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. బ్యాక్ చేసిన డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ఈ ఘటనపై ఎస్సై సురేంద్ర నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.